క్లుప్తంగా

ఆత్మీయులకు వైఎస్సార్‌సీపీ అండ



నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణమూర్తి తల్లి దేశమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి వేపగుంట గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు.

ఈ–క్రాప్ నమోదు



ఈ–క్రాప్‌లో వివరాలను నమోదు చేస్తున్న ఏఓ

నింద్ర: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని ఏఓ తులసిరాం అన్నారు. సోమవారం మండలంలోని చవరంబాకం గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, చెరకు పంటల వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసిన వివరాలు, విస్తీర్ణం, పేరు, పూర్తి వివరాలు ఈ–క్రాప్‌లో పొందుపరచాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు



కృష్ణజమ్మపురం ఆర్బీకేలో కియోస్కి యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం కృష్ణజమ్మపురం, ఆముదాల రైతు భరోసా కేంద్రంలో రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడడం, అంతర పంటల సాగుతో మిత్ర పురుగులను వృద్ధి చేయడం, రసాయన మందులు వాడకం తగ్గింపు తదితర అంశాలపై వివరించారు. ముఖ్యంగా రైతులకు ప్రభుత్వ పరంగా వచ్చిన సంక్షేమ పథకాల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవల గురించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సుదీప్ కుమార్ ఎంపిక



విద్యార్థి సుదీప్ కుమార్‌తో ఉపాధ్యాయులు

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుదీప్ కుమార్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తమ పాఠశాల విద్యార్థి సుదీప్ కుమార్ ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు సుదీప్ ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు.

రూ.12 లక్షల గ్రాంట్ మంజూరు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని టీవోసీఐసీ కేంద్రం, పీఆర్ఐఎస్ఎం పథకం కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలలో ఆవిష్కరణలకు న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ రూ.12 లక్షల వార్షిక గ్రాంట్‌ను అందించింది. వీసీ భారతి టీటీసీఐసీ కేంద్రం కృషిని అభినందించారు. ప్రొఫెసర్ పి జోత్స్నకు గ్రాంట్ మంజూరు పత్రాలు అందజేశారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- సీఎం జగనన్న రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారు
- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత
- ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' లక్ష్యం: నోడల్ అధికారి రవిరాజు



రోగులకు కంటి అద్దాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత

కార్వేటినగరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్‌లు నవీన, గుణవతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ జగనన్న వైద్య రంగానికి పెద్దపీట వేసి గ్రామాలను జల్లెడ పడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా సీఎం జగనన్న తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఆయుష్మాన్ భవ కార్డును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఏ రాష్ట్రంలో అయినా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్‌ను కృపాలక్ష్మి, ఎంపీపీ లత, నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉప సర్పంచ్ కుప్పయ్య, హెచ్ఎం హేమారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శృతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

శ్రీరంగరాజపురం: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని జిల్లా జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి రవిరాజు అన్నారు. మండలంలోని అంబామహారాజపురం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తామన్నారు. ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్నీ జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని, దేశ ప్రధాని సైతం ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. శిబిరంలో 602 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అర్హులైన 132 మందికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లికమ్మ, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దారు లోకనాథపిళ్లై, మండల వైద్యాధికారులు డాక్టర్ పల్లవి, బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, సందీప్ రాజు, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందరికీ ఆరోగ్యం అందుతుందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్యమే మహాభాగ్యమంటారు అందుకే ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ధృడ సంకల్పంతో వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించడానికి విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. రోగుల వద్దకే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. పేద విద్యార్థులు సైతం డాక్టర్లు కావాలన్న ధృడ సంకల్పంతో గడచిన నాలుగేళ్లలో రూ.8 వేల కోట్ల అంచనా వ్యయంతో 17 మెడికల్ కాలేజీలకు భూమి పూజ చేయగా ఇందులో ఐదింటిని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇలా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని ప్రజలకు అందిస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెల్త్ కార్డులు, కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి): మండలంలోని జగన్నాథపురం సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి సుమారు 700 మందికి పైగా రోగులు వచ్చారు. అలాగే 200 మందికి కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, ఈఓపీఆర్డీ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని నరసింహపురం గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, తహసీల్దార్ బాబు సమక్షంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 316 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యసిబ్బంది, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు అబ్బుఅనితా లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీపీ అనిత మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని చార్వాకానిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్, వైద్యాధికారులు తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యాన్ని చేరువ చేసిన ఘనత ప్రభుత్వానిదే అన్నారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు.



వైద్య శిబిరంలో ఓపీ టికెట్ అందించి ప్రారంభిస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



హెల్త్ కార్డులు, కళ్ల అద్దాలు అందుకొన్న వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన రోగులు



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న కృపాలక్ష్మి, ఎంపీపీ లత

భవిష్యత్ దిక్సూచీలు..

అంగన్‌వాడీ కేంద్రాలు..

- ఆన్‌లైన్‌లో అంగన్‌వాడీ సేవలు
- ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వర్కర్లకు స్మార్ట్‌ఫోన్లు
- పిల్లలకు సక్రమంగా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం




పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఇకపై యాప్‌లో నమోదు కానుంది. కేంద్రం తెరిచినప్పుడు నుంచి మళ్లీ ముగించే వరకు కేంద్రంలో జరిగే అన్ని కార్యకలాపాలు, పిల్లల హాజరు నుంచి మధ్యాహ్నం భోజనం వరకు ప్రతీదీ నమోదు చేయడమే ద్వారా కేంద్రాల నిర్వహణలో పారదర్శకతను తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

శ్రీరంగరాజపురం: అంగన్‌వాడీ కేంద్రాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల పట్ల ఉన్న అపవాదును తొలగించే విధంగా చర్యలకు ఉపక్రమించింది. అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యార్థుల సంఖ్య తక్కువగా హాజరైనట్లు రికార్డుల్లో నమోదు చేసి వారికి అందాల్సిన పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే అపవాదు అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉండేది. ఇకపై వీటన్నిటికీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెక్ పెట్టనుంది.

ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు..

అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే రోజూ జరిగే ప్రతి విషయాన్ని వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రం తెరిచినప్పటి నుంచి ఉదయం 9 గంటలకు పిల్లల హాజరు, గుడ్లు పెట్టినప్పుడు మధ్యాహ్నం భోజనం చేసినప్పుడు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కూడా గర్భిణులు, బాలింతలకు ఫొటో తీసి వాటి వివరాలను కూడా యాప్‌లో నమోదు చేస్తారు. ఈ విధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఫొటోలో ఉన్న వారి కంటే అదనంగా లబ్ధిదారులు కేంద్రానికి వచ్చారని చెప్పడానికి వీలు ఉండదు. దీని వల్ల గతంలో లాగా పిల్లలు రాకపోయినా, వచ్చినట్లు హాజరు వేసుకోవడానికి వీలు ఉండదు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందుతాయి.



కార్యకర్తలకు అందించిన స్మార్ట్‌ఫోన్



అంగన్‌వాడీ భవనం

అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు..

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే వివరాల నమోదు కోసం స్మార్ట్ ఫోన్లు కొద్దిరోజుల క్రితం అందించింది. జిల్లాలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,408 మంది కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరికి 2,408 స్మార్ట్‌ఫోన్లు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 11,574 మంది గర్భిణులు, 9,365 మంది బాలింతలు ఉన్నారు. 3–6 ఏళ్లలోపు పిల్లలు 35,488 మంది ఉన్నారు. వీరి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి ఇచ్చిన ఫోన్లలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలి.

పిల్లలకు బలవర్ధక పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలకు ప్రభుత్వం బలవర్ధకరమైన ఆహారాన్ని అందిస్తుంది. ఆకుకూరలు, పప్పు, గుడ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం ప్రతి రోజూ అందిస్తున్నారు. పిల్లలకు 100 మి.లీ., గర్భిణులు, బాలింతలకు 200 మి.లీ. పాలు చొప్పున ఇస్తున్నారు. ఇదే కాక చిక్కీలు, రాగిపిండి, బెల్లం, కర్జూరం పంపిణీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టిహాకారం లోపాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

యాప్‌లో వివరాలు నమోదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవల వివరాలను యాప్‌లో ప్రతి కార్యకర్త నమోదు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం వారికి స్మార్ట్‌ఫోన్లు అందించింది. రోజు వారీ జరిగే కార్యక్రమాలు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీని వల్ల ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు, పౌష్టికాహారం అందుతాయి.

–ఎస్.నాగశైలజ, జిల్లా స్త్రీ, సంక్షేమ సాధికారిత అధికారి

ఇబ్బందులు తప్పాయి..



గతంలో గర్భిణులకు సరైన పౌష్టికాహారం దొరక్క, రక్తహీనతతో కాన్పు సమయంలో చాలా ఇబ్బందులకు గురయ్యాం. నేడు జగనన్న ప్రభుత్వం మా గర్భిణులకు అన్నలా నా బిడ్డకు మేనమామలా నెలలు నిండినప్పుడు నుంచి పౌష్టికాహారంతో పాటు డెలివరీ అయిన తరువాత నన్ను, నా బిడ్డను ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నారు. పౌష్టికాహారం అందిస్తున్నందుకు జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

–టి.భువనేశ్వరి, పెద్దతయ్యూరు


వేద వర్సిటీతో పలు సంస్థల ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు అందజేస్తున్న వేద వర్సిటీ వీసీ రాణీ సదాశివమూర్తి

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద వర్సిటీలో పబ్లికేషన్ విభాగంలో నిర్వహిస్తున్న తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియపై వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తితో పలు సంస్థలు సోమవారం ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్, ప్రాచ్య తాళపాత్ర గ్రంథ డైరెక్టర్ వి.రంగరాజు ఆధ్వర్యంలో తాళపత్రాలను వేద వర్సిటీ సహకారంతో డిజిటలైజేషన్ చేయనున్నారు. అలాగే కడపకు చెందిన యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న సీపీ బ్రౌన్ లాంగ్వేజ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉన్న తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసేందుకు డైరెక్టర్ ఆచార్య రామ్ ప్రసాద్ రెడ్డితో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధేశ్యామ్, బద్వేలుకు చెందిన కవయిత్రి మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షుడు విద్వాన్ జి.హనుమంతరావు, యోగి వేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు



త్రోబాల్ ఆడుతున్న విద్యార్థులు

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 450 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా ఎంఈఓలు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం ఆధ్వర్యంలో బాలుర, బాలికల విభాగాల్లో పలు ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతిభ ఆధారంగా న్యాయ నిర్ణేతలు బాలికల విభాగంలో 14 మందిని, బాలుర విభాగంలో 14 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.సురేష్, విజయకుమారి, బాబు తెలిపారు. వీరికి ఏకాంబరకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 5 రోజుల పాటు రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్ ఉంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం నమశ్శివాయం మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని ఇందరు విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ చూపడం శుభపరిణామం అంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల కార్యదర్శులు సుబ్రమణ్యం రెడ్డి, నూరుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓలు, వ్యాయామ ఉపాధ్యాయులు